# అర్థం చేసుకోవూ!

దర్భా లక్ష్మీఅన్నపూర్ణ

**సౌరభాలు విరజిమ్మే పుష్పాలు, చల్లదనాన్ని చిలుకరించే పన్నీరు కలిపి జల్లుగా కురిసి- ఆ జల్లు నెమ్మదిగా ఆగిపోయినట్టుగా పెళ్లి సందడంతా ముగిసింది. ఎవరో ముఖ్యులు తప్ప పెళ్లికి వచ్చిన వాళ్లంతా వెళ్లిపోయారు. పెళ్లి సందడిలో జలపాతంలాంటి ఒక రకమైన వుత్సాహం. యిప్పుడు నిండుగా ప్రవహిస్తున్న నదిలా వుంది ఆ వుత్సాహ వాతావరణం.**

పెళ్లికూతురు మంజూష పరిస్థితి ఒక కంట ఆనంద బాష్పాలు మరో కంట కన్నీరు అన్నట్టుగా వుంది. లోపలి గదిలో డ్రెస్ మార్చుకుంటున్న పెళ్లికొడుకు- వుదయమే ఆమెకి భర్తగా మారిన హేమంత్ దగ్గరకి ఏదో చెబుదామని వెళ్తే వుప్పెనలా చుట్టేసి ఏవిటేవిటో చేసేసరికి శరీరంలోని అణువణువూ ఆనందంతో పరవశించిపోయింది. ఎవరయినా చూస్తారేమోనన్న భయంతో అతన్నెలాగో విడిపించుకుని పక్క గదిలోకి వచ్చేసరికి తన బట్టలన్నీ పెట్టెలో సర్దుతున్న తల్లి కళ్ల నీళ్ళు తుడుచుకోవటం చూసేసరికి- యిన్నాళ్లూ పెరిగిన ఈ యింటినీ, తల్లిదండ్రుల్నీ, చెల్లెల్నీ వదిలి వెళ్లాలన్న భావంతో గుండెల్లో నిశ్శబ్దంగా గూడు కట్టుకుంటూ వస్తున్న దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికింది. తల్లి భుజాల చుట్టూ చేతులు వేస్తూ "ఆడపిల్లే యిల్లు వదిలి వెళ్ళాలన్న రూలు ఎవరు పెట్టారు?" అంది. ఆమె గొంతులోంచి దుఃఖంతోపాటు వుడుకుమోత్తనం పొంగుకొస్తోంది.

"ఆ యింట్లో అబ్బాయికీ, ఈ యింట్లో అమ్మాయికీ పెళ్ళయి- యిద్దరూ కలిసివుండాలన్నప్పుడు ఎవరో ఒకరు చోటు మారొద్దూ!" తన దుఃఖాన్ని నవ్వుగా మారుస్తూ అంది సీత.

"అక్కా! బావగార్ని యిక్కడే వుండిపొమ్మని చెప్పు!" తను ఆ మాటని అనటం సమంజసం కాదని తెలిసినా అక్కని వదిలి వుండాలన్న బాధలో అలా అనేసింది శిరీష.

"అలాగే జరిగితే హేమంత్ వెళ్ళి వాళ్ళమ్మ భుజాల్ని లాగే పట్టుకుని అక్క నన్ను వేసిన ప్రశ్ననే వాళ్ళమ్మని వెయ్యాలి" సీత మళ్ళీ నవ్వేస్తూ అంది.

తల్లి చెప్పిన ఆ మాట తన మనోనేత్రం ముందు దృశ్యంగా మారేసరికి మంజూషకి నవ్వొచ్చింది. అలా వద్దులే అని కూడా అనిపించింది.

"మొదటిసారి వెళ్ళేప్పుడు అలా అనిపిస్తుంది! వచ్చి వెళ్తూవుంటే ఓస్- యింతేనా అనిపిస్తుంది. అందులోనూ వూర్లోనే కదా! నేనయితే మీ నాన్నతో మూడు వందల మైళ్ళు ప్రయాణం చేసి వచ్చాను!" సీత కూతుర్ని సముదాయిస్తూ అంది.

అన్నీ సర్దుకోవటం అయ్యాక సీత కూతురి చేతిలో మొబైల్ ఫోన్ పెడుతుంటే వర్ధని "అమ్మో- ఆ ఫోను వద్దండీ బాబూ! నాకు విసుగు! రోడ్డుమీద నడిచే పది మందిలో తొమ్మిదిమంది ఫోన్‌లో మాట్లాడుతూనే వుండటం చూశాక విసుగు పుట్టింది! అవసరం వచ్చినప్పుడే దాన్ని వుపయోగించాలి! అప్పుడే దాని విలువ! రోడ్డుమీద నడుస్తూ కబుర్లు చెప్పుకోవటానికే మొబైల్ ఫోన్ కనిపెట్టింది అన్నట్టుగా వుందీ జనం ధోరణి చూస్తుంటే! మా యింట్లో ఫోన్ వుంది! ఎప్పుడు కావాలంటే అప్పుడు మంజూష మీతో మాట్లాడొచ్చు! నేనేం అభ్యంతరం చెప్పను!" అంది.

వియ్యపురాలు చెప్పిన కచ్చితమైన ఆ తీరుకి సీత కూతురి చేతిలో ఫోన్ పెట్టలేకపోయింది. వియ్యపురాలు చెప్పిన మాటలో అర్థం వున్న మాట నిజమే అయినా కచ్చితంగా చెప్పిన ఆ తీరుకి సీత మనస్సు చిన్నబుచ్చుకుంది. మంజూష సంగతి యిక చెప్పనే అక్కర్లేదు. యింత కచ్చితమైన అత్తగారితో కూతురి జీవితం ఎలా వుంటుందోనని గబగబా ఆలోచించెయ్యటం మొదలుపెట్టింది ఆవిడ మస్తిష్కం! మంజూషది అసలే అతి సున్నితమైన మనస్సు- ఈవిడ ప్రతిదానికీ యిలా కచ్చితంగా వ్యవహరించేస్తుంటే... ఆలోచిస్తూనే లోపలికి వంటింట్లోకి వెళ్లింది సీత.

వియ్యపురాలి మనస్సులో ఆలోచన కనిపెట్టిన వర్ధని సీత వెనకాలే తనూ వెళ్లింది. చెప్పాల్సింది చెప్పి వచ్చిందీ.

వర్ధని హాల్లో కూర్చున్న కొడుకుతో మాట్లాడటానికి వెళ్ళగానే మంజూష దిగులుగా "మొబైల్ లేకుండా ఎలాగమ్మా? అత్తయ్యగారి పద్ధతి చూస్తుంటే నాకు భయం వేస్తోంది!" మొబైల్ ఫోనన్నది హస్తభూషణంగా అయిపోయిన ఈ రోజుల్లో ఫోన్ పట్టుకోవడానికి వీల్లేదంటే ఏ అమ్మాయి మాత్రం ఝుడుసుకోదు! శరీరంలోంచి ఏదో ఒక భాగం వేరయిపోయినట్టుగానో ప్రపంచంతో సంబంధం తెగిపోయినట్టుగానో వుంటుంది! ఫోన్ తీసుకురావడానికి వీల్లేదని చెప్పేసిన అత్తగారికి యింకేం చాదస్తపుటాలోచనలు వున్నాయోనన్న బెదురూ, భయం వచ్చేశాయ్ మంజూషకి. కూతురి మొహంలో కలత చూసిన సీత అంది "మీ అత్తగారు చెప్పిన మాటల్లోనూ అర్థం వుంది! ఏదో ఈసారికి ఆవిడ మాట వింటే ఆవిడకి తృప్తి! మళ్లీ వచ్చినప్పుడు ఫోన్ తీసుకు వెళ్దువుగానిలే!"

తన అయిష్టాన్ని యింత నిర్మొహమాటంగా కచ్చితంగా చెప్పగలిగిన అత్తగారు ముందు ముందు ఎలాంటి ఆంక్షలు పెడతారోనన్న భయంతో కూడిన అనుమానం మంజూషని కలవరపెట్టసాగింది. మళ్ళీ అంతలోనే అనుకుంది. తనకి రక్షణగా నిలిచే హేమంత్ వుండగా తనకెందుకు భయం?


ఈ రెండు రోజుల సాన్నిహిత్యంలో హేమంత్ చాలా మంచి మనిషనిపిస్తోంది. మృదువైన స్వభావం! తనంటే ప్రాణం అని చెప్పాడు. పెళ్లి కుదిరాక ముహూర్తానికి ఆరునెలల వ్యవధి వుంది. ఈ ఆరునెలల్లో వూహల్లోనే ప్రేమ పందిరివేశాడట! ప్రేమ అనే మల్లెతీగని నాటితే అది అత్యంత ఆరోగ్యంగా పెరిగి పందిరినిండా అల్లుకుపోయిందిట! తను యిప్పుడు ఎవరో కొత్తమ్మాయిలా అనిపించటం లేదుట! యింత సున్నిత హృదయం వున్న హేమంత్ భార్యని నొప్పించడుగాక నొప్పించడు!

ఆ క్షణంలో మంజూష మరో ముఖ్యమైన విషయం మర్చిపోయింది. సున్నితమనస్కుడైన మనిషి ఆత్మీయుల్లో ఎవరినీ నొప్పించలేడన్న విషయం- వ్యతిరేకించలేడన్న విషయమూను!

మంజూష యిటువంటి భయాల్లో వుండగానే అత్తారింటికి రావటం జరిగిపోయింది. వచ్చేటప్పుడు ఆమెకి తల్లి చెప్పింది "మీ అత్తగారు చాలా మంచిమనిషి! కాస్త ముక్కుకి సూటిగా పోయే మనస్తత్వం! అంతే! జాగ్రత్తగా మసులుకో!"

హేమంత్ కూడా చెప్పాడు "నాకు మనుష్యుల మనసుల్ని విశ్లేషించగలశక్తి వచ్చినప్పట్నుంచీ గమనిస్తున్నాను అమ్మ ఆలోచనల్లో నిజాయితీ వుంటుందెప్పుడు!" మంజూష సమాధానంగా చిరునవ్వు నవ్వింది గానీ మనస్సులో మాత్రం మొబైల్ ఫోన్ విషయం ముల్లులా గుచ్చుకుంటూనే వుంది. మొబైల్ చేతిలో లేకపోవటం ఏదో పెద్ద వెలితిగా వుంది. ఏదో తెలియని చికాకు.

వారం రోజులు వారం నిముషాల్లా గడిచిపోయాయ్. కారణం హేమంత్ శలవులో వున్నాడు. కబుర్లు, నవ్వులు, సినిమాలు, షికార్లు- ఏకాంతం దొరి



కితే చాలు హత్తుకోవటాలు- అనుభూతుల్ని పంచుకోవటాలు- యిట్టే గడిచిపోయింది. హేమంత్ ఆ రోజు వుదయం పదిగంటలకల్లా ఆఫీసుకి వెళ్లిపోయాడు.

పనిమనిషి సహాయంతో వర్ధనే అన్ని పనులూ ముగించేసింది. మంజూష ఏదయినా చేస్తానంటే పదహారు రోజుల పండగ వెళ్లేదాకా ఏ పనీ చెయ్యకూడదు అంది వర్ధని. అత్తాకోడళ్లిద్దరూ టీవీ ముందు కూర్చున్నారు. టీవీ చూస్తూనే వర్ధని కొడుకు గురించి బోలెడు ముచ్చట్లు- చిన్నప్పటివీ పెద్దప్పటివీ అన్నీ చెప్పింది. కోడల్ని కూడా చిన్నప్పటి కబుర్లు చెప్పమంది. మంజూష చెప్పింది. కాస్సేపు బాగానే వుంది. ఆ తర్వాత హేమంత్ గురించిన తీయటి వూహలు మంజూషని అల్లరి పెట్టటం మొదలుపెట్టాయ్. శరీరంలో అణువణువు అతనికోసం తపించటం మొదలుపెట్టింది. అత్తగారి సమక్షంలో పరధ్యానం మొదలయింది. నిద్రొస్తోంది. పడుకుంటానని చెప్పి లోపలికి వచ్చేసింది తన గదిలోకి. హేమంత్ ఆఫీసుకి చేరగానే ఫోన్ చేస్తాడేమోనని అత్తగారితో కబుర్లు చెబుతూనే ఎదురు చూసింది. ఊహుఁ! తల్లిలాగే హేమంతుక్కూడా ఫోనంటే ప్రత్యేకమైన ద్వేషం ఏమయినా వుందా? తనేమో యింతగా శరీరంలో సగభాగం ఎక్కడో తప్పిపోయినట్టుగా విలవిల్లాడిపోతోంది- హేమంత్‌కి ఏవీ అనిపించటం లేదూ?

ఎ ం జూ ష

హృదయం అలకపాన్పుని అధిరోహించింది. పోనీ తను చేద్దాం అంటే నంబరు తీసుకోలేదు. హేమంత్ మొబైలేమో- ఉదయం ఆఫీసుకి వెళ్తున్నప్పుడు "నాన్నగారివ్వాళ పెన్షనాఫీసుకి వెళ్లాలి! మొబైల్ నాన్నగారికిచ్చి వెళ్ళు హేమంత్! ఆలశ్యం ఏదయినా అయితే తెలుసుకోవటానికి వుంటుంది!" అని తల్లి అంటే తన మొబైల్ తండ్రి చేతిలో పెట్టి వెళ్లాడు హేమంత్. సమయం గడిచే కొద్దీ మంజూష విరహంతో వేగిపోవటం మొదలుపెట్టింది. ఒకపక్క అతని కోసం తపన- మరోపక్క తనలా హేమంత్‌కి అనిపించటం లేదూ అన్న దుఃఖం!

మధ్యాహ్నం భోంచేస్తున్నప్పుడు కూడా హేమంత్ తన పక్కనే వుంటే ఎంత బావుండుననిపించింది.

యిప్పుడే కనుక మొబైల్‌ఫోన్ తన చేతిలో వుంటే అత్తగారికి తెలియకుండా హేమంత్‌తో ఎన్ని కబుర్లు చెప్పివుండేదో! ఆఫీసు ఫోన్ నెంబరు ఎలాగో అలా తెలుసుకుని వుండేది ఆఫీసుకి వెళ్లటానికి నువ్వు మెట్లు దిగుతున్నప్పుడు వెనకనుంచి పరుగున వచ్చి హత్తుకోవాలనిపించింది. కారు స్టీరింగ్‌మీద చేతులు వేసి స్టార్ట్ చేస్తున్నప్పుడు ఆ చేతివేళ్ళ మీదనే నా దృష్టి నిలిచిపోయింది- ఆ చేతివేళ్ళు రాత్రంతా నాతో ఎంత అల్లరి చేశాయో గుర్తుకురాగానే పరుగున వచ్చి వాటిమీద ముద్దుల వర్షం కురిపించాలనిపించింది. హేమంత్- నువ్వు నాకో అద్భుతంలా అనిపిస్తున్నావ్ అని చెప్పాలని వుంది. యింత తియ్యటి కబుర్లు చెప్పుకోలేకపోవటం- శరీరంలో ఏదో అలజడి! హేమంత్‌తో ఈ కబుర్లన్నీ చెబితేకానీ అలజడి తీరదు! హేమంత్‌కోసం సాయంకాలం అయ్యేసరికి పెద్ద మాటల మూటని సిద్ధం చేసుకుంది మంజూష. నిముషానికోమాట దాన్లో చేరుస్తూనే వుంది.

సాయంత్రం ఆమె జీవితంలో అద్భుతంలా మారసాగింది. ఎందుకంటే ఆ సాయం సమయంలో హేమంత్ తన ఎదురుగా వుంటాడు

కనుక. అదృష్టం బావుండి అత్తయ్య, మావయ్య గుడికి వెళ్లారు.

మంజూష ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురుచూస్తున్న ఘడియరానే వచ్చింది. హేమంత్ వచ్చాడు. అతనిని సుడిగాలిలా చుట్టేసింది. తను పడ్డ విరహం వర్ణించింది. నీకు లేదా అని నిలదీసింది. అన్నింటికీ హేమంత్ చిరునవ్వే సమాధానం! అతని చేతులు మాత్రం ప్రపంచంలో వేగాన్నంతా, వుద్వేగాన్నంతా తనలో నింపుకున్నట్టుగా వున్నాయ్.

అతని స్పర్శానందాన్ని తానను భవిస్తూ, అతనికి అందిస్తూ ప్రొద్దుట్నుంచీ చేర్చి కూర్చిన తన మాటల మూటని విప్పసాగింది మంజూష. చెప్పాలనుకున్న కబుర్లు చేతల్లో చెప్పాలంటే విరహం అవసరం అని ఆమెతో చెప్పాలనిపించింది హేమంత్‌కి.

హేమంత్ సాంగత్యంలో మంజూష ఆనందాన్ననుభవిస్తోందేగానీ- ఈ మాటలన్నీ అప్పటికప్పుడు ఫోన్‌లో చెప్పలేకపోయానే- ఆ క్షణంలో ఆ ఆనందాన్ని అనుభవించలేకపోయానే అన్న దిగులు వేధిస్తూనే వుంది ఓ మూల. అందుకే అంది "అత్తయ్యగారు అన్ని విషయాల్లోనూ మంచివారే! ఒక్క మొబైల్ విషయంలో తప్ప! ఉదయం నుంచీ ఎంత విరహం అనుభవించానో- ఎంత ఆనందం మిస్సయ్యానో!"

"మిస్సయితేనేం- వడ్డీకి వడ్డీ తీర్చేసుకుంటున్నావ్‌గా!" హేమంత్ అన్నాడు.

"ఊహుఁ! నాకు రోజంతా ఆనందాన్ని పంచుకోవాలని వుంది! ఓపలేని విరహంతో వేగిపోవటం నావల్ల కాదు బాబూ! అవును! నా దగ్గర మొబైల్‌లేదు. ఫోన్ దగ్గరకి వెళ్లి ఫోన్ చెయ్యాలంటే యిబ్బందీ, మొహమాటం! మీరయినా యింటికి ఫోన్ చెయ్యొచ్చుగా! నేనసలు గుర్తుకురాలేదా!" ప్రేమ, అధికారం కలిసిన స్వరంతో నిలదీసింది మంజూష.

"పనితో అస్సలు తీరిక దొరకలేదు! యిప్పుడు మాత్రం ఏవయింది- యించక్కా ఎంజాయ్ చేస్తున్నాంగా! ఎదురుచూపులు ఎక్కువయిన కొద్దీ కలయిక మరీ రుచిగా వుంటుంది!" కొంటెగా అన్నాడు. హేమంత్ మాటలు నిజమే అనిపించినా మొబైల్ ఫోన్ గురించిన అసంతృప్తి మాత్రం పోవటం లేదు. తల్లితో కబుర్లకి లోటులేదు. సీత రోజూ చేస్తోంది. స్నేహితులతోనూ కబుర్లు చెప్పుకునేందుకు లేదు. హేమంత్ గురించిన కబుర్లు స్నేహితురాళ్ళతో ఎంతగానో చెప్పుకోవాలనివుంది. మంజూషకి తల్లిమీద వున్న అలక హేమంత్ దృష్టిని దాటిపోలేదు. మంజూష మనస్సులో మాట గ్రహించినట్టుగా మర్నాడు ఆమెతో చదువుకున్న వీణ వచ్చింది. యిక మంజూష ఆనందం యింతా అంతా కాదు. స్నేహితురాల్ని అత్తగారికి పరిచయం చేసింది. స్నేహితురాల్ని చూడగానే కోడలి కళ్ళల్లో మెరపులు వర్ధని దృష్టిని దాటిపోలేదు. యిద్దరికీ కబుర్లు చెప్పుకునేందుకు ఫ్రీగా వుంటుందని వర్ధని అక్కడ్నుంచి వెళ్ళిపోయింది. స్నేహితురాల్ని కాస్సేపు హాల్లోనే కూర్చోబెట్టి కబుర్లు చెప్పి తర్వాత తన గదిలోకి తీసుకువెళ్లింది.

"ఎలా వుంది హేమంత్‌తో జీవితం?" చిలిపిగా అడిగింది వీణ. వీణకింకా పెళ్ళికాలేదు.

"హేమంత్‌తో జీవితానికేం అద్భుతంగా వుంది!" కళ్ళల్లో మెరుపులు కురుస్తుండగా అంది.

"అత్తగారితో జీవితం?"

"మా అత్తగారితో మిగతా విషయాల్లో ఎక్కడా సమస్యలేదు- ఒక్క ఫోన్ విషయంలోనే యిబ్బందిగా వుంది. ఎవరితో కబుర్లు చెప్పాలన్నా కుదరటంలేదు! యిప్పుడు నీకు చెప్పిన కబుర్లన్నీ నా చేతిలో ఫోన్ వుంటే ఎప్పుడో చెప్పేసేదాన్ని! యిదిగో నువ్వు యివ్వాళ వచ్చేదాకా నీతో కబుర్లు చెప్పాలన్న ఆలోచనతోనే సరిపోయింది!"

వీణ ఒక్క నిముషం ఆగి సాలోచనగా అంది "ఫోన్ వుంటే ఎప్పుడో చెప్పేసేదానివే అనుకో! కానీ నువ్వు హేమంత్ గురించి చెబుతున్నప్పుడు నీ కళ్ళల్లో నిండిపోయిన మెరుపుల్ని ఎదురుగా వున్నాను కనుక చూడగలుగుతున్నాను! అంతేకాకుండా ఎప్పట్నుంచో నాతో చెప్పాలనుకున్న కబుర్లేమో- ఆ చెప్పే తీరులో ఆతృత వీక్షించటానికి గమ్మత్తుగా వుంది సుమా! కొన్ని కబుర్లు, విశేషాలు ఎదురెదురుగా కూర్చుని చెప్పుకుంటేనే బావుంటాయేమోననిపిస్తోంది!"

వీణ వెళ్ళిపోయాక కూడా మంజూష ఆమె అన్న మాట గురించే ఆలోచిస్తూ వుండిపోయింది. కొన్ని కబుర్లు ఎదురెదురుగా కూర్చునే చెప్పుకోవాలా! యిలా ఎంత ఆలోచిస్తున్నా ఒక ఆలోచన మాత్రం ఆమె మస్తిష్కాన్ని వీడిపోవటంలేదు. హేమంత్‌ని తన గుప్పెట్లోనే వుంచుకోవాలని ప్రయత్నిస్తోంది అత్తగారు. కోడలంటే అభిమానమే! కానీ ఏదో అభద్రతా భావం ఆవిడని భయపెడుతున్నట్టుగా వుంది. ఆ అభద్రతా భావం హేమంత్‌కీ, తనకీ మధ్య ఏ సమస్యలూ సృష్టించదు కదా!

మంజూష యిలా తర్జనభర్జనలు పడుతుండగానే రెండుమూడు రోజులు యథాప్రకారం- హేమంత్ పొద్దున్న ఆఫీసుకి వెళ్ళటం- సాయంకాలం రావటం- అలకలతో- ఆరాటాలతో- అర్పణలతో సాయంకాలాలు అద్భుతంగా మారటం! కావాలనే హేమంత్ రెండు రోజులు సెలవులు పెట్టాడు. సినిమాలతో, షికార్లతో రోజంతా హుషారుగా వున్నా సాయంకాలాలు కాస్త నీరసంగా వున్నట్టుగా అనిపించింది. మర్నాడు హేమంత్ ఆఫీసుకి వెళ్లిపోతుంటే అంత విచారంగా అనిపించలేదు. విరహంలో వున్న సుఖం జ్ఞాపకం వచ్చింది. ఎదురుచూపులో వున్న ఆనందం రారమ్మని పిలిచింది. హేమంత్‌కోసం కలవరించి కలవరించి కౌగిలించుకోబోయే మధుర క్షణాలు జ్ఞాపకం వచ్చాయ్.

సాయంకాలం అవుతున్నకొద్దీ హేమంత్ కోసం ఆరాటం క్షణక్షణం పెరగసాగింది. అతని చిలిపిచేష్టలు. ఆ స్పర్శలోని హాయి జ్ఞాపకం వస్తూ

## పార్వతిగా లారాదత్తా!

తీసిన సినిమాలనే తీయడం అనేది లేటెస్టు ట్రెండ్‌గా చెప్పుకోవచ్చు. దాదాపు అన్ని భాషల సినిమా రంగాల్లోనూ పాత సినిమాలని మళ్లీ మళ్లీ తీస్తున్నారిప్పుడు. ఆమధ్యనే షారుఖ్ ఖాన్ హీరోగా 'దేవదాసు' సినిమా వచ్చింది. ఇందులో పార్వతిగా ఐశ్వర్యా రాయ్ నటించింది. ఇప్పుడు మళ్లీ దేవదాసు నిర్మాణం జరగనున్నట్టు బాలీవుడ్ వార్తలు. ఈ కొత్త దేవదాసులో పార్వతిగా 'లారాదత్తా' నటించే చాన్సు వుందంటున్నారు. ఇక దేవదాసు ఎవరనేది ఇంకా తెలియాల్సి వుంది.



బాధలోని హాయి గమ్మత్తుగా అనిపించసాగింది.

ఏం తోచనట్టుగా అనిపించిన మంజూష హాల్లోకి వచ్చేసరికి అత్తగారు దేనికోసమో వెతుక్కుంటున్నట్టుగా అనిపించింది. వీలయితే సహాయం చేద్దామని అడిగింది కూడాను.

"యిక్కడో తెలుగుపాటల క్యాసెట్ వుండాలమ్మా! దానికోసం చూస్తున్నాను!" వెతుకుతూనే అలా అన్న వర్ధని మరుక్షణంలో "ఆ! దొరికింది! పాతపాటలంటే నాకు చాలా యిష్టం! మీరంతా యింగ్లీషు పాటలు, కొత్త పాటలూ- యివ్వే వింటారు. ఈ పాటలెప్పుడయినా విన్నావేమో చెప్పు!" అంటూ వర్ధని క్యాసెట్‌ని టేప్ రికార్డర్‌లో పెట్టి ఆన్ చేసింది.

ఘంటసాల, పి.లీల పాడిన యుగళగీతం వస్తోంది. నీకోసమే నే జీవించునది... విరహము కూడా సుఖమే కాదా- నిరతము చింతన మధురము కాదా?- మంజూష అది వింటూనే ఆశ్చర్యపోయింది. పాట వినటం అయ్యాక లోపలికి తన గదిలోకి వెళ్ళి ఆ వాక్యాన్నే పదే పదే తలుచుకుంది. విరహము కూడా సుఖమే కాదా- అవును... హేమంత్ గురించిన ఆలోచనల్లో మునిగిపోవటం- అతను చెంతలేకపోవటం- యిది కూడా సుఖంగానే వున్నట్టుగా వుంది. ఎందుకంటే అతని గురించిన ఆలోచన, సాయంకాలం రాగానే జరిగే హత్తుకోవటాలూ, అర్పణలూ తల్చుకుంటుంటే మరీ మరీ మధురంగా అనిపిస్తోంది. అది చెప్పాలి, యిది చెప్పాలి అన్న ఆతృత అద్భుతంగా వుంది.

వీణ చెప్పినట్టుగా మాటలు చెబుతున్నప్పుడు కళ్ళలోని భావాలని, మెరుపులని కూడా చూడవచ్చు. ఎంత నిజం కదూ! యిన్నాళ్ళూ తనెందుకు గ్రహించలేకపోయింది. యిప్పుడు తన చేతిలో ఫోన్ కనుక వుండి వుంటే హేమంత్ గురించిన తన తీయటి భావాలన్నీ చెప్పేసి వుండేది. కానీ తను అలా చెబుతున్నప్పుడు అతని కళ్ళలో మెదిలే భావాలని చూడగలదా తను? నిజానికి అవెంత అద్భుతంగా వుంటాయ్. అతని కళ్ళలోని చిలిపి భావాలు చూస్తే తన కళ్ళల్లో మెరపులు! తను చెబుతున్న మాటలకి హేమంత్ రెచ్చిపోతూ చేసే అల్లరి... ఓహ్! వీటన్నిటి గురించీ తనెందుకు ఆలోచించలేకపోయింది? అనవసరంగా అత్తయ్యగార్ని అపార్థం చేసుకుంది.

హేమంత్‌కి విషయాలన్నీ ముందే తెలుసునేమో- అందుకేగా అన్నాడు 'ఏవయింది, వద్దీతో సహా వసూలు చేసుకుంటున్నావ్‌గా- ఎదురుచూపులు ఎక్కువయిన కొద్దీ కలయిక మరీ రుచిగా వుంటుంది!' అన్నాడు. అందుకేనేమో- ఆఫీసు నుంచి కావాలనే ఫోన్ చెయ్యటం లేదేమో!

మంజూష యిలా ఆలోచనల్లో వుండగానే తల్లి దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. "రేపు పొద్దున్న వస్తాను! వచ్చేటప్పుడు నీ మొబైల్ తీసుకొచ్చి యిస్తాను! మీ అత్తగారు చాలా మంచి మనిషమ్మా- నీకు ఫోన్ యివ్వొద్దు అని చెప్పటంలో ఆవిడ వుద్దేశం మంచిదేనమ్మా! అన్ని కబుర్లూ ఫోన్లో చెప్పేసుకుంటే యింటికి వచ్చాక చెప్పుకునేందుకు వుండవని! ఓ వారం రోజులు వాళ్ళని విరహం అంటే ఎలా వుంటుందో రుచి చూడనిద్దాం- దాని రుచి చూడని జీవితం జీవితమే కాదు అన్నారావిడ! యిక యిప్పుడు ఫోన్ యివ్వండి అన్నారు!"

"అత్తయ్యగారు అలా ఎందుకన్నారో నాకూ అర్థం అయిందిలే! రేపు నువ్వురా గానీ- నా ఫోన్ తీసుకురావొద్దు!" అంది మంజూష తల్లితో.

"ఎందుకు?" సీత కూతుర్ని ఆట పట్టించింది.

"నువ్వు ఫోన్ తెచ్చిస్తే హేమంత్ ఆఫీసులో పనిలో వుండగా ఫోన్లు చేసి విసిగిస్తానేమోనని భయంగా వుంది! అందుకేవద్దు!" అంది మంజూష.

'అదికాదులే కారణం' అనుకుంది అటువైపువున్న సీత మనసులోనే నవ్వుకుంటూ, పైకి యిలా అంది "మీ అత్తగారు మరి ఓ పదిరోజులు మాత్రం నీకు ఫోన్ యివ్వొద్దన్నారు! పది రోజులయ్యాక్కూడా యివ్వకపోతే ఏమైనా అనుకుంటారేమో!"

"ఫోను వద్దన్నది నేనే అని మా అత్తయ్యగారికి చెబుతానులే" అనేసింది మంజూష.

"అయితే సరే! నేను వూరికే వచ్చి కాస్సేపు కూర్చుని వెళ్ళిపోతానులే!" అంది సీత.

మంజూషకి అత్తగారిమీద అభిమానం, గౌరవం రెట్టింపయ్యాయి! పిల్లల ఆనందం గురించి యింత సూక్ష్మంగా ఆలోచించే వాళ్ళు ఎంతమంది వుంటారు? తనో పిచ్చిమొద్దులా ఆలోచించింది. అప్పటికీ హేమంత్ చెబుతూనే వున్నాడు ఎడబాటు వుంటేనే కలయిక అద్భుతంగా వుంటుందని! తనే అర్థం చేసుకోలేకపోయింది. అత్తగారు అనేటప్పటికి ముందుగా చెడుగా ఆలోచించటమే తను చేసిన తప్పు! కొత్త జంట ఒకరికోసం ఒకరు పడే ఆత్రంలో ఎడబాటు మరీ అద్భుతాలు చేస్తుంది! ఆ అద్భుతాలు యింకా యింకా కావాలనిపిస్తున్నాయ్! యింకో పదిరోజులయ్యాక ఫోన్ తెచ్చుకోవటం గురించి ఆలోచిస్తుంది తను!

కోడలి మొహం వెలిగిపోవటం చూసి వర్ధనికీ ఆనందంగా అనిపించింది. 'అర్థం చేసుకోరూ పిల్లలు!' ముద్దుగా, విసుగ్గా అనుకుంది.



## టాలీవుడ్ తెరపై రియాసేన్!

'జల్లుల్లో..జల్లుల్లో..' అంటూ లిమ్కా యాడ్‌లో జిల్లుమనే కనిపించే రియాసేన్ త్వరలోనే టాలీవుడ్ స్క్రీన్‌పై కనిపించబోతోంది. కొన్ని తెలుగు సినిమాల్లో నటించిన మూన్ మూన్ సేన్ చిన్న కూతురు రైమా సేన్ 'ధైర్యం' సినిమాలో హీరోయిన్‌గా పరిచయం అయింది. ఇప్పుడు మూన్ మూన్ పెద్ద కూతురు రియాసేన్ 'కంత్రి' సినిమా ద్వారా టాలీవుడ్‌లోకి వస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నిర్మాణం కానున్న 'కంత్రి'లో ఒక హీరోయిన్‌గా హన్సిక నటిస్తుంటే మరో హీరోయిన్‌గా రియాసేన్ నటించబోతోందని తాజా సమాచారం. టాలీవుడ్‌లో రియా 'లక్' ఎలా వుందో?